# మెదక్ పట్టణానికి కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు రాక

**మెదక్ (ప్రజా జ్యోతి)**



తేదీ. 24-08-2026 సోమవారం నాడు ఉదయం11-00 గంటలకు మెదక్ పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్ లో పి ఏ సి ( రాజకీయ వ్యవహారాల కమిటీ) ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం కలదు.- ఈ సమావేశానికి శ్రీ మహేష్ కుమార్ గౌడ్ పిసిసి అధ్యక్షులు, దామోదర్ రాజనర్సింహ ఆరోగ్యశాఖ మంత్రివర్యులు, లివివేక్ వెంకటస్వామి జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు, మెదక్ శాసనసభ్యులు శ్రీ డాక్టర్ మైనంపల్లి రోహిత్

వివరాలు 2లో




# సంగారెడ్డి మెదక్

సోమవారం 24 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:11





## అడ్డగోలుగా బెల్ట్‌షాపుల

# బరితెగింపు దందా!

## - గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం!

## - మద్యానికి బానిసవుతున్న యువత..

## పెరుగుతున్న గొడవలు- నిర్లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులు..

## - బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

పగలు, రాత్రి అనే తేడా లేకుండా కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం 5 గంటల నుంచే మద్యం విక్రయాలు ప్రారంభమవుతున్నాయని, అర్ధరాత్రి 12 గంటలు దాటినా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలను నియంత్రించి యువతను మద్యానికి దూరంగా ఉంచాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒకే గ్రామంలో ఏకంగా 9 బెల్ట్‌షాపులు!**

కొండాపూర్ మండలంలోని తొగర్పల్లి, మల్కాపూర్, అనంతసాగర్, సైదాపూర్, సైదాపూర్ తండా, మన్సాన్‌పల్లి, మునిదేవునిపల్లి, గంగారం, కోనాపూర్, హరిదాస్పూర్ తదితర గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సుమారు 3 వేల జనాభా ఉన్న సైదాపూర్ గ్రామంలో ఏకంగా 9 బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

మిగతా 2 లో

# గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం

## - బాలాజీ అనురాధ హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 23:**

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ హాస్పిటల్‌ను తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కె. మదన్ మోహన్ రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు.

మిగతా 2 లో

# అడ్డగోలుగా బెల్ట్‌షాపుల బరితెగింపు దందా!

మొదటిపేజీ తరువాయి

దీంతో విద్యార్థులు, యువత, పెద్దలు అనే తేడా లేకుండా మద్యానికి అలవాటుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో గ్రామాల్లో గొడవలు జరగడం సర్వసాధారణంగా మారిందని అంటున్నారు. కొన్ని గ్రామాల్లో కిరాణా దుకాణాల వెనుక భాగంలోనే బహిరంగంగా మద్యం విక్రయించడంతో పాటు బార్‌లను తలపించే విధంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

### మూసివేసిన బెల్ట్‌షాపులు మళ్లీ తెరుచుకున్నాయా?

గతంలో పలు గ్రామాల్లో బెల్ట్‌షాపుల కారణంగా కుటుంబాల్లో గొడవలు పెరగడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళనలు చేసి కొన్ని బెల్ట్‌షాపులను మూసివేయించిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయితే ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడటంతో గతంలో మూసివేసిన గంగారం, హరిదాస్పూర్ వంటి గ్రామాల్లో సైతం తిరిగి మద్యం విక్రయాలు ప్రారంభమయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఏదీ?

గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత ఎక్సైజ్, పోలీసు అధికారులు తగిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. తొగర్పల్లిలో రహదారి పక్కనే ఉన్న ఓ హోటల్‌లో సిట్టింగ్ ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ, గ్రామాల్లో బెల్ట్‌షాపుల నియంత్రణపై మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

### మామూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలి

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. వైన్‌షాపుల నుంచి నెలవారీగా మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.గ్రామాల్లో యువత మద్యానికి బానిస కాకుండా, కుటుంబాల్లో గొడవలు పెరగకుండా బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు..

# మెదక్ పట్టణానికి కాంగ్రెస్ డిసిసి అధ్యక్షులు రాక

మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ సభ్యులు శ్రీ సురేష్ షెట్కర్ శాసనసభ్యులు పి సంజీవరెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొననున్నారు. - మోటార్ సైకిల్ ర్యాలీ : పట్టణంలోని వెల్కమ్ బోర్డు ( నర్సాపూర్ రోడ్ ) నుండి వినాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది.కావున మున్సిపల్ చైర్ పర్సన్ ,వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ వైస్ చైర్మన్,మాజీ కౌన్సిలర్ లు,కోప్షన్ సభ్యులు, యువజన, మహిళా అన్ని రకాల అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రతి ఒక్కరూ హాజరు కాగలరని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది.

# గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం

మొదటిపేజీ తరువాయి



ఆధునిక వైద్య పరికరాలతో పాటు నిపుణులైన వైద్యుల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ.. నారాయణఖేడ్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు, అత్యవసర చికిత్సలను నిరంతరం అందుబాటులో ఉంచుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంకేతిక పరికరాల కోసం వేధించొద్దు..!

## - మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి

## - భక్తిశ్రద్ధలతో శ్రావణ వేడుకలు





**జహీరాబాద్, ఆగస్టు 23(ప్రజా జ్యోతి న్యూస్)**

యువకులు, విద్యార్థులు సాంకేతిక పరికరాల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం సరి కాదని తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్, బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధి పతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ఆశ్రమంలో జ్యోతిర్లింగాలకు మహారుద్రాభి షేకం, సహస్ర బిల్వార్చన, ఇష్టలింగ పూజ, మహామంగళహారతి నిర్వహించి భక్తులకు ప్రవచనామృతాన్ని అందించారు. విద్యార్థులు, యువత సెల్‌ఫోన్లు, ఇతర సాంకేతిక పరికరాలను అవసరమైన మేరకే వినియోగించు కోవాలని సూచించారు. ఐఫోన్ కోసం మహా రాష్ట్రలో ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటనను ప్రస్తావిస్తూ.. ఖరీదైన ఫోన్ విషయం లో జరిగిన వివాదం ఒకే కుటుంబంలో ముగ్గురి ప్రాణాలను బలిగొందని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా యువకులు, విద్యార్థులు కోరికలను అదుపు లో ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ రాత్రి బసవపురాణం, భజన సంకీర్తనలు భక్తిశ్రద్ధ లతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నందినిగిరి మాత, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వావలంబనకు పొదుపే తొలి అడుగు

## - మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 23:**

ఆర్థిక స్వావలంబనకు పొదుపే తొలి అడుగని పాలమూరు మండల సమాఖ్య సీఆర్పీ ట్రైనర్లు స్వప్న, జంబేశ్వర్ అన్నారు. ఆదివారం మానూర్ మండలం దుదంగోడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు పొదుపు అలవాటును పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. సంఘాల నిర్వహణ, బ్యాంకు రుణాలను సక్రమంగా వినియోగించుకోవడం, రుణాల ద్వారా ఆదాయం పెంచే జీవనోపాధి అవకాశాలను ఎంచుకోవడం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాలు పేదరిక నిర్మూలనతో పాటు కుటుంబాల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ప్రతి మహిళ క్రమం తప్పకుండా పొదుపు చేస్తూ, అందుబాటులో ఉన్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలతో పాటు గ్రామాలు కూడా మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోసీసీ హడమండ్లు, వీఓఏ కవిత, గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాలు సాయమ్మతో పాటు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కలం సైనికుడి అకాల మరణం.. గొల్ల రమేష్‌కు కన్నీటి వీడ్కోలు..

## - గుండెపోటుతో సీనియర్ జర్నలిస్ట్ అకాల మృతి

**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 23:**



మనోహరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గొల్ల రమేష్ ఆదివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఉమ్మడి తూప్రాన్‌మనోహరాబాద్ ప్రాంత జర్నలిస్టు వర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రమేష్ అకాల మరణవార్తతో తోటి పాత్రికేయులు దిగ్భ్రాంతికి గురయ్యారు.రమేష్ భౌతికకాయాన్ని పలువురు సీనియర్ పాత్రికేయులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన కర్తవ్యం ఎడిటర్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ ఆధ్వర్యంలో పాత్రికేయులు నివాళు లర్పించి, రమేష్‌తో తమకున్న అనుబంధాన్ని, ఆయన జర్నలిజం ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రమేష్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటని, నిబద్ధతతో పనిచేసే సీనియర్ పాత్రికేయుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.అనంతరం రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన పాత్రికేయులు వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఉమ్మడి తూప్రాన్‌మనోహరాబాద్ ప్రెస్ క్లబ్ తరపున గొల్ల రమేష్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఆర్. శివశంకర్ గౌడ్, తీగుళ్ల నాగరాజు, భాస్కర్ గౌడ్, రామస్వామి, మచ్చ యాదగిరి, శివ కృష్ణ గౌడ్, పెద్దిగారి నగేష్, నవీన్, చందు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో తీవ్ర విషాదం చెరువులో శవమై తేలిన రెండేళ్ల బాలుడు..

## హత్యేనని కుటుంబసభ్యుల అనుమానం!

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**



సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రెండేళ్ల ఎనిమిది నెలల బాలుడు మహా తేజ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నిన్న సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయిన బాలుడు, రాత్రికి సమీపంలోని చెరువు గుంతలో శవమై తేలడం కలకలం రేపుతోంది. తమ బిడ్డది సాధారణ మరణం కాదని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.ఎన్కేపల్లి గ్రామానికి చెందిన టేకూరి చంద్రశేఖర్, సంగీత దంపతుల రెండో కుమారుడు మహా తేజ్.. నిన్న సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద ఆడుకుంటూ ఒక్కసారిగా కనిపించకుండా పోయాడు. బాలుడు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు, గ్రామ యువకులు చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. సిసిటీవీ ఫుటేజ్ పరిశీలించినా బాలుడి ఆచూకీ దొరకకపోవడంతో సమీపంలోని గరువాయి కుంట చెరువు వద్ద వెతికారు.రాత్రి 8:30 గంటల సమయంలో చెరువు గుంతలో బాలుడి మృతదేహం లభ్యమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ఇంటికి దాదాపు 200 మీటర్ల దూరంలో ఉన్న చెరువు వరకు అంత చిన్న బాలుడు ఒంటరిగా వెళ్లే అవకాశం లేదని బాధితులు చెప్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులే బాలుడిని తీసుకెళ్లి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ సదాశివపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్ఐ కృష్ణ తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అన్ని కోణాల్లో విచారణ వేగవంతం చేశారు.

# దివ్యాంగుల కోసం యూడీఐడీ ప్రత్యేక శిబిరాలు

**మెదక్ (ప్రజాజ్యోతి )**



దివ్యాంగుల కోసం నిర్వహించనున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డు ( యు డి ఐ డి ) ప్రత్యేక శిబిరం తేదీలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు వెల్లడించారు. గతంలో ఆగస్టు 26న తేది శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటించగా, ఆ రోజున మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ఉండటంతో ఈ శిబిరాన్ని ఆగస్టు 25వ తేదీకి మార్చినట్లు తెలిపారు.ఆగస్టు 25వ తేదీన మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ( జి జి హెచ్ )లో దివ్యాంగుల కోసం ప్రత్యేక యు డి ఐ డి క్యాంపును నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. శిబిరానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేపడుతున్నారని పేర్కొన్నారు.నూతన చేయూత పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, ఇప్పటివరకు యు డి ఐ డి ధ్రువీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఆగస్టు 24వ తేదీ సాయంత్రం వరకు మీ సేవా కేంద్రాల్లో యు డి ఐ డి కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# దుర్గయ్య కుటుంబానికి శ్రీనివాస్‌గౌడ్ 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేత

**మెదక్ (ప్రజాజ్యోతి)**

పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సానిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి దుర్గయ్య ఆకస్మిక మృతితో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. నిరుపేద కుటుంబానికి చెందిన దుర్గయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్రంగా బాధపడుతున్నారు.విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం నాగ్సానిపల్లి గ్రామానికి వెళ్లి దుర్గయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబానికి తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. దుర్గయ్య మృతి ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు. కష్టకాలంలో ఉన్న బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుటుంబానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అవసరమైన సహాయం అందించేందుకు ముందుంటామని భరోసా ఇచ్చారు.



# ఆంజనేయస్వామి దేవాలయంకి డమరుకం అందజేత

## - కమ్మరి వేమాచారి

**హత్నూర 23 ఆగస్టు (ప్రజా జ్యోతి)**

మండల పరిధిలోని సాదుల నగర్ గ్రామంలో లో ఆదివారం నాడు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంకి సుమారు 22 వేల రూపాయలు విలువచేసే డమరుకాని అందజేశారు.ఈ సందర్భంగా కమ్మరి వేమచారి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ ఆంజనేయ స్వామి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆయన కోరారు స్వామికి రాబోయే రోజుల్లో తన వంతుగా మరిన్ని కార్యక్రమాలు చేపడతానని వేమచారి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు గ్రామస్తులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.





## బాలాజీ అనురాధ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసిన జర్నలిస్టు ప్రతినిధులు

**కల్హేర్. 23.ఆగస్టు. ప్రజా జ్యోతి**

నారాయణఖేడ్: బాలాజీ అనురాధ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, సతీష్ తివారి, నారాయణఖేడ్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి ప్రారంభం కావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు, స్థానికులు పాల్గొన్నారు.




## ఆదివారం పురస్కరించుకొని భక్తజనసంద్రంగా మారిన ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయం





**మెదక్ (ప్రజాజ్యోతి)**

తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన ఏడుపాయల శ్రీ వన దుర్గ భవాని మాత ఆలయం ఆదివారం భక్తజన సందోహాశీతో కిటకిటలాడింది తెల్లవారుజామున నుండే జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఏడుపాయలకు తరలివచ్చారు మంజీరా నది తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ ప్రాంగణంలో క్యూ లైన్ లో బార్లు తీరారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ మరిత పెరిగింది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకున్నారు కోరికల నెరవేరిన భక్తులు అమ్మవారికి ఓడిబియాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు సంతానం కోసం ఎదురుచూస్తున్న పలువురు దంపతులు సంతానగుండంలో స్నానాల ఆచరించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ పూజారులు పార్టీవ శర్మ శంకర్ శర్మ ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్ మధుసూదన్ రెడ్డి ప్రతాపరెడ్డి సాయిబాబా నరేష్ మహేష్ యాదగిరి దీపక్ రెడ్డి బలరాం తదితరులు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జిల్లా కేంద్రాల్లోనే 90 శాతం వైద్య చికిత్సలు

## - ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాం - మంత్రి దామోదర్ రాజనర్సింహ

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 23:**





జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నారాయణఖేడ్ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సమీపంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లా స్థాయిలోనే అధిక శాతం వైద్య చికిత్సలు అందేలా ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.









# 300 గ్రాముల పౌడర్ స్వాధీనం

## - తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తి.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మెదక్ (ప్రజాజ్యోతి)**

మెదక్ జిల్లా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 300 గ్రాముల పాపిషా పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈ పౌడర్ గుర్తించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఛత్తీస్గడ్ కు చెందిన కార్తీక్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పౌడర్‌కు సంబంధించిన వివరాలు, దాని తరలింపు వెనుక ఉన్న కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. టోల్ ప్లాజాల వద్ద వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని పోలీసులు తెలిపారు. అక్రమంగా మాదక పదార్థాలు లేదా ఇతర నిషేధిత వస్తువుల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సంగారెడ్డి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం గుర్తింపు కార్డుల ఆవిష్కరణ

**మహేశ్వరప్ప ప్రజాజ్యోతి**

సంగారెడ్డి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో గుర్తింపు కార్డుల (ఐడెంటిటీ కార్డుల) ఆవిష్కరణ మరియు పంపిణీ కార్యక్రమం శ్రీ బడంపేట్ రాచన్న స్వామి దేవస్థాన ప్రాంగణంలో.. జిల్లా అధ్యక్షులు అడివయ్య స్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దౌలతాబాద్ వాసుదేవ శర్మ గారు, దేవస్థానం ఈవో శ్రీ శివ రుద్రప్ప గారు, జిల్లా అధ్యక్షులు శ్రీ మడుపతి అడివయ్య స్వామి , ప్రధాన కార్యదర్శి శ్రీ రాజశేఖర్ శర్మ జిల్లా కోశాధికారి శ్రీ శంభు ప్రసాద్ , దేవస్థానం చైర్మన్ జగదీశ్వర్ స్వామి , బడంపేట్ గ్రామ సర్పంచ్ దయాకర్ పటేల్ , జగదీశ్వర్ స్వామి చెన్న వీరయ్య స్వామి, నియోజకవర్గ ఇన్చార్జిలు వీరన్న స్వామి, సంగమేశ్వర స్వామి, శ్రీశైలం స్వామి శాంతకుమార్ స్వామి,జిల్లా కార్యవర్గం సంతోష్ స్వామి, చంద్రశేఖర్ స్వామి,రమేష్ స్వామి, రామ శర్మ, గోవిందా చారి, రవీందర్ స్వామి, పండరి స్వామి, అనిల్ స్వామి సంగారెడ్డి జిల్లా మండల కన్వీనర్లు,రాష్ట్ర కార్యవర్గం మహేష్ స్వామి ,అయ్యవారి వెంకటేశం, సంగమేశ్వర స్వామి జిల్లా అర్చకులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా అధ్యక్షులు కరకమలములచే సంగారెడ్డి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం గుర్తింపు కార్డులను ఆవిష్కరించి, జిల్లాలోని అర్చకులందరికీ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ గారు మాట్లాడుతూ అర్చకుల సేవలకు గుర్తింపు, వారి హక్కులు మరియు సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేయడంలో వేతనం పెంచడానికి, అర్చకులకు వచ్చే వివిధ పథకాలు అమలు చేయడానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలుపడం జరిగింది.. కోశాధికారి శంభు ప్రసాద్ మాట్లాడుతూ.. అర్చకులు అందరూ ఐడెంటి కార్డులను సద్వినియోగపరచుకొని తెలంగాణలో దేవదాయ శాఖలోని దేవాలయాలలో శ్రీగ్ర దర్శనానికి ఉపయోగించుకోవాలని సూచించారు.. సభ ఏర్పాట్లు అనుమతించిన బడం పేట ఆలయ ఈవో, సర్పంచ్, చైర్మన్ అర్చక, బృందానికి, ఏర్పాట్లు చేసిన కోహీర్ కన్వీనర్ అనిల్ స్వామి బృందంకి, ధన్యవాదాలు తెలిపారుజిల్లా అధ్యక్షులు అడివయ్య స్వామి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు మరియు సంగారెడ్డి జిల్లాలోని ప్రతి ఒక్క అర్చక స్వామికి జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు మరియు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారం, ఐక్యతతో భవిష్యత్తులో కూడా అర్చకుల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని ,గుర్తింపు కార్డులు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు అని జిల్లా అధ్యక్షులు మడుపతి అడివయ్య స్వామి తెలపడం జరిగింది.



## - అక్షరాలను శిల్పంలా చెక్కిన జర్నలిస్టు..
## - నేడు బతుకు కోసం చేయి చాస్తున్నాడు!

**రమేష్ స్క్రిప్ట్ అంటే నాడు ఉదయం,**

**విలేకరులకు సబ్‌ఎడిటర్లకే పాఠం! "వార్త ఎలా రాయాలో రమేష్‌ను చూసి నేర్చుకోండి" అని చెప్పుకునే స్థాయిప్రకృతి అడవివన్యప్రాణుల కథనాల్లో అద్భుతమైన వర్ణన అవినీతిపై కలం ఎక్కుపెడితే అక్రమార్కుల గుండెల్లో దడ 'ఉదయం', 'వార్త' దినపత్రికల్లో మెదక్ పట్టణ ప్రతినిధిగా తనదైన ముద్రఒకప్పుడు వార్తల కోసం మెదక్ వీధుల్లో తిరిగిన రమేష్.. నేడు అదే వీధుల్లో బతుకు కోసం భిక్షాటనమూడు దశాబ్దాల నాటి జర్నలిజం జ్ఞాపకాలు ఇప్పటికీ పదిలం2015లోనే 'ప్రాణాలు కాపాడండి' అంటూ ఆర్తనాదం.. పదకొండేళ్లు గడిచినా మారని జీవితంభిక్ష కాదు.. బోనాల రమేష్‌కు గౌరవప్రదమైన బతుకు భరోసా కావాలి!**

# భోంగొండ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం

## - ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు.

**జహీరాబాద్, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)**

న్యాల్కల్ మండలం కల్బేమల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భోంగొండ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని, భోంగొండ మహారాజ్ ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండా లని ఆకాంక్షించారు. ప్రజల విశ్వా సానికి, ఆధ్యాత్మి కతకు ప్రతీకగా నిలిచే ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజి ఆత్మ విజయ్ కుమార్, ఎఫ్ ఎంసి చైర్మన్ సత్యం ముదిరాజ్, మాజి మండల పార్టీ అధ్యక్షులు నరసింహ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు ప్రవీణ్, బి ప్రవీణ్, నాయకులు రవి కుమార్, మారుతి, వినోద్, మల్ రెడ్డి, పీటర్ ఇమ్రాన్, చంద్రు, గ్రామ సర్పంచ్ శివకుమార్, మాజి సర్పంచ్ మహిపాల్, పార్టీ అధ్యక్షుడు బి.శంకర్, మారుతి పాటిల్, చంద్రన్న, శివన్న, నవీన్, నాగేష్, మారుతి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.





# జోగు సంగీత కేసులో న్యాయం కోసం

# నవోదయ సిద్దార్థ పోరాటం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:ఆగస్టు 23:**

కంగ్టి మండలం దెగుల్‌వాడి గ్రామానికి చెందిన జోగు సంగీత హత్య కేసులో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్దార్థ స్పష్టం చేశారు. ఈ కేసును మానవ హక్కుల కోణంలో తీవ్రంగా పరిగణిస్తున్న ఆయన, బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జోగు సంగీత మృతి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఘటనకు దారితీసిన పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు. కేసులో వాస్తవాలు పూర్తిగా వెలుగులోకి రావడంతో పాటు, బాధిత కుటుంబానికి చట్టపరమైన న్యాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.




### న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదు

బాధిత కుటుంబానికి న్యాయం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని నవోదయ సిద్దార్థ పేర్కొంటున్నారు. కేసు దర్యాప్తులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా అన్ని కోణాల్లో విచారణ జరిపించాలని, నిందితులు ఎవరైనా చట్టం ముందు సమానులేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి కేసు పురోగతిపై వివరాలు కోరడంతో పాటు, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చట్టపరమైన మార్గాల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు.




### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్

జోగు సంగీత కేసులో పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, వర్తించే చట్టాల ప్రకారం కేసు నమోదు చేయాలని నవోదయ సిద్దార్థ డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తే వాటిని అమలు చేయాలని కోరుతున్నారు. బాధిత కుటుంబానికి రక్షణ, న్యాయ సహాయం, ప్రభుత్వ పరంగా లభించాల్సిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కోరుతున్నారు.

### మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యం

ఒక కుటుంబానికి న్యాయం చేయడం మాత్రమే కాకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థలు బాధ్యతాయుతంగా పనిచేసేలా చేయడమే తమ లక్ష్యమని నవోదయ సిద్దార్థ పేర్కొంటున్నారు. జోగు సంగీత కేసును చివరి వరకు న్యాయపరంగా అనుసరిస్తామని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.





### ఆగస్టు 2న దెగులవాడి గ్రామ సందర్శన.. బాధిత కుటుంబానికి పరామర్శ

జోగు సంగీత హత్య ఘటనపై సమాచారం అందుకున్న అనంతరం ఆగస్టు 2న నవోదయ సిద్దార్థ దెగులవాడి గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి తరఫున న్యాయం కోసం పోరాడుతామని హామీ ఇచ్చారు.అనంతరం ఘటనకు సంబంధించిన విషయాలను తెలుసుకుని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కంగ్టి ఎస్సైకి ఫిర్యాదు చేశారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



### ఆగస్టు 21న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

కేసులో మరింత ఉన్నతస్థాయి జోక్యం అవసరమని భావించిన నవోదయ సిద్దార్థ ఆగస్టు 21న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జోగు సంగీత కేసును సమగ్రంగా పరిశీలించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.కేసులో పరిస్థితులను చట్టపరంగా పరిశీలించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తే వాటి ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రక్షణ, న్యాయ సహాయం, ప్రభుత్వ పరంగా లభించాల్సిన ప్రయోజనాలు అందేలా చూడాలని కమిషన్‌ను కోరారు.

### ఆగస్టు 22న సంగారెడ్డి ఎస్పీకి వినతిపత్రం

తదుపరి చర్యల్లో భాగంగా ఆగస్టు 22న సంగారెడ్డి జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం సమర్పించారు. జోగు సంగీత కేసు దర్యాప్తును వేగవంతం చేసి, వాస్తవాలను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కేసులో ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి, నేరానికి బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన రక్షణ కల్పించడంతో పాటు, కేసు పురోగతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అక్రమ వెంచర్లు కనిపించవా.. అధికారుల కళ్లు మూశాయా?

## - మన్సాన్పల్లి లో115 ఎకరాల్లో భారీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు.. చర్యలు ఎప్పుడు?

## - మల్కాపూర్ 158/ఈ లో అనుమతులు లేకుండా 8 ప్లాట్ల నిర్మాణాలు

## - కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమ నిర్మాణ పనులు.

## - సంబంధిత పంచాయతీ అధికారులకు ఈ అక్రమాలు కనిపించడం లేవా?

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్, మునిదేవునిపల్లి, మన్సాన్పల్లి గ్రామాల శివార్లలో అనుమతులు లేకుండా వెంచర్లు, నిర్మాణాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై గత ఆరుఏడు నెలలుగా వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ జిల్లా, మండల, గ్రామస్థాయి పంచాయతీ అధికారులు నామమాత్రపు నోటీసులతోనే కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





### మల్కాపూర్ పేరు లేని వెంచర్లో 8 ప్లాట్ల నిర్మాణ పనులు

మల్కాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 158/ఈ లో వెంచర్‌కు పేరు లేకుండానే సుమారు 8 ప్లాట్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంచర్‌కు సంబంధించిన అనుమతులు, నిబంధనలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగుతుండటం పట్ల ప్రశ్నిస్తున్నారు. మునిదేవునిపల్లి గ్రామ పరిధిలోనూ అనేక వెంచర్లలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మన్సాన్పల్లి లో 115 ఎకరాల్లో భారీ ప్రహరీ గోడ మన్సాన్పల్లి గ్రామ శివారులో లక్ష్మారెడ్డిగూడెం గేటు సమీపంలోని సర్వే నంబర్లు 36, 37, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54, 80, 81, 82, 83 పరిధిలో సుమారు 115 ఎకరాల భూమిలో నూతనంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ భూమిలో ఎలాంటి పంచాయతీ అనుమతులు లేకుండానే భారీ ప్రహరీ గోడ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయల విలువైన భూమిలో ఇంత భారీ స్థాయిలో నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.







### మూడవ నోటీసు ఇవ్వడానికి. ఆరు నెలలుగా చర్యలు శూన్యం

మల్కాపూర్, మునిదేవునిపల్లి గ్రామాల్లోని అక్రమ వెంచర్లు, అనుమతులు లేని నిర్మాణాలపై గత ఆరుఏడు నెలలుగా వరుసగా కథనాలు వెలువడుతున్నప్పటికీ అధికారుల తీరు మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికే ఒకటో రెండో నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ ఆరు నెలలు గడిచినా ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇవ్వడం వరకే అధికారులు పరిమితమవుతున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ దృష్టి సారించాలి

మన్సాన్పల్లి గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ ప్రహరీ గోడ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ వెంచర్లపై వరుసగా ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలువడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే అంశంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. మల్కాపూర్, మునిదేవునిపల్లి, మన్సాన్పల్లి గ్రామాల్లోని వెంచర్లపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు నిర్లక్ష్యం వహించిన అధికారుల పనితీరుపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

# శబరిమల అయ్యప్ప సేవ సమాజం జిల్లా కమిటీ ఎన్నికగీ

## - ఇద్దరు గురు స్వాములు ఎన్నిక

**హత్నూర 23ఆగష్టు (ప్రజాజ్యోతి)**

శబరిమల అయ్యప్ప సేవా సమాజం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీలో హత్నూర మండలానికి చెందిన గురుస్వాములు గణేష్,ఆంజనేయులు గౌడ్ లకు అవకాశం దక్కింది. జిల్లా కమిటీ సభ్యులుగా హత్నూర గ్రామానికి చెందిన గురు స్వామి ఆంజనేయులు గౌడ్,దౌల్తాబాద్ గ్రామానికి చెందిన గణేష్ గురు స్వాములకు జిల్లా కమిటీ సభ్యులుగా నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి గురు స్వామి తోపాటు రాష్ట్ర కమిటీ నాయకులు నియామక పత్రాన్ని అందజేయడంతో పాటు శాలువా మెమెంటో తో సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన గణేష్, ఆంజనేయులు గౌడ్ గురు స్వాములు మాట్లాడుతూ శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు రాష్ట్ర జిల్లా కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే హత్నూర మండల స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. అయ్యప్ప సేవా సమాజం తరపున సామాజిక కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు సైతం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.



# జహీరాబాద్ పట్టణంలో బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**జహీరాబాద్, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)**

విశ్వ బంధుత్వ దినోత్సవం, రాజయోగిని దాదీ ప్రకాశమణి ప్రవిత్ర స్మృతిదినం పురస్కరించు కోని బ్రహ్మాకుమారీస్ ఆద్వర్యంలో ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని బ్రహ్మ కుమారీస్ సేవా కేంద్రం అవరణలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా బ్రహ్మ కుమారీస్ సేవా కేంద్రం జహీరాబాద్ ఇంచార్జ్జి బి.కె.ఉషా బేహన్, డాక్టర్ శేషు పద్మారావు లు జ్యోతి ప్రజ్వాలన చేసి రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం సందర్బంగా జహీరాబాద్ పట్టణంలోని బ్రహ్మాకుమారీస్ సభ్యులు, రోటరీ క్లబ్, స్వచ్చంద సంఘల ప్రతినిధులు 35 మంది రక్తదానం చేశారు. ఈ సందర్బంగా బ్రహ్మ కుమారీస్ సేవా కేంద్రం జహీరాబాద్ ఇంచార్జ్జి బి.కె.ఉషా బేహన్ మాట్లడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని సూచించారు.ఒక్క యూనిట్ రక్తం ఒక్క ప్రాణాన్ని కాపాడ గలమని అన్నారు. మీరు అందించిన రక్తదానం మరోక్కరి జీవితానికి వరం కవాలని కోరారు. మానవ సేవే మాదవ సేవ అనే స్పూర్తితో నిర్వహిస్తున్న రక్తదాన శిభిరంలో తమ అమూల్యమైన సహకారనిఅందించి రక్తదానం చేసిన ప్రతి నిధులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సేవాకేంద్రం ప్రతినిధులు, రోటరీ క్లబ్ సభ్యులు, వివిధ స్వచ్చంద సంఘల సభ్యులు, తదితరులు పాల్గోన్నారు.





# వర్షం కురవడంతో రైతులకు ఊరట

**మునిపల్లి, ఆగస్టు 23(ప్రజాజ్యోతి):**

గత పదిహేను రోజుల నుండి సకాలములో వర్షాలు కురవక పోవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మండలములో ఈ సంవత్సరము ప్రధానంగా పత్తి,సోయా,పెసర,మినుము, జొన్న ,కంది,పంటలను రైతులు సాగు చేశారు. నీటి సౌకర్యం కలిగిన రైతులు వరిసాగు చేశారు.మిరప,ఉల్లి,చెరుకు,పంటలను కూడా పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో పేరుకే వర్షాకాలము జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజనులో సాగయ్యే పంటలకు సరిపోయేలా వర్షాలు కురువ లేవని రైతులు ఆందోళనకు గురయ్యారు.అయినప్పటికీ వర్షాలు కురవక పోతాయా అనే ఆశతో పంటలను కాపాడుకునేలా కలుపులు,ఎరువులు,క్రిమి సంహారక మందులు వేసుకుంటూనే వచ్చారు. అయితే అన్ని రకాలుగా పంటలను కాపాడుకునేందుకు పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షం కోసం రోజు ఎదిరి చూడాల్సిన పరిస్థితి వచ్చిందని,ఆదివారము రోజు సాయంత్రము కురిసిన వర్షము జల్లులకు రైతుల్లో ఆందోళన తగ్గి పంటలు పండుతాయని భరోసా కలిగినట్లయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# గుంతలమయంగా మల్కాపూర్ ప్రధాన రహదారి..

- ప్రయాణికులకు నరకయాతన...- చినుకు పడితే చిత్తడే..

- గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు..

ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు చేయాలని గ్రామస్తులు డిమాండ్...






**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మల్కాపూర్ గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా అధ్వానంగా మారి, అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో ఈ మార్గంలో ప్రయాణం నరకయాతనగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చినుకు పడితే రహదారిపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు చేరి చిత్తడిగా మారుతోంది. దీంతో గుంతలు కనిపించక వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రహదారి మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గుంతలు రోజురోజుకూ పెరుగుతున్నా తాత్కాలికంగా కూడా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రహదారి మరమ్మతు పనులు ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

# ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం


## జిల్లా కన్వీనర్‌గా ఎ. రాంబాబు

- జిల్లా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తా..

- త్వరలో పూర్తి స్థాయి కార్యవర్గం

**అందోల్, ఆగస్టు 23 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘాన్ని మరింత బలోపేతం చేసి, జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. సికింద్రాబాద్ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.సంఘం వ్యవస్థాపకులు నీలకంఠం ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, పాండు ముదిరాజ్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం పాల్గొంది. ఈ సందర్భంగా సంఘాన్ని జిల్లాల వారీగా విస్తరించే క్రమంలో వివిధ జిల్లాలకు కన్వీనర్లను, కో కన్వీనర్ లను ఏకగ్రీవంగా నియమించారు.అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా జోగిపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎ. రాంబాబు ముదిరాజ్, కో కన్వీనర్ గా గోవర్ధన్ ముదిరాజ్ లను ఏకగ్రీవంగా నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం తన శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులను సమన్వయం చేసుకుంటూ సంఘాన్ని






బలోపేతం చేస్తానని తెలిపారు. త్వరలోనే సంగారెడ్డి జిల్లాకు తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టుల సంఘం పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని రాంబాబు వెల్లడించారు.జిల్లాలోని ముదిరాజ్ జర్నలిస్టులందరినీ సంఘం పరిధిలోకి తీసుకువచ్చి, వారి సమస్యలపై సమిష్టిగా పోరాడేందుకు కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.

# విద్యార్థి మృతి పట్ల సమగ్ర విచారణ చేపట్టాలి

## - హాస్టల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ డిమాండ్

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి, ఆగస్టు 23:**



నారాయణఖేడ్ జూకల్ శివారులో కొనసాగుతున్న శంకరంపేట మహాత్మా జ్యోతిరావు పూలే హాస్టల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్లక్ష్యానికి బాధ్యులైన హాస్టల్ ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోనూ హాస్టళ్లలో పలు ఘటనలు జరిగినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తగిన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని అన్నారు. హాస్టళ్ల పర్యవేక్షణలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.విద్యార్థి మృతికి గల వాస్తవ కారణాలను వెలికితీసేందుకు వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని, హాస్టల్‌లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ప్రభుత్వ అధికారులు హాస్టళ్లను క్రమం తప్పకుండా సందర్శించి పరిస్థితులను పరిశీలించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని నర్సింలు అన్నారు. సబ్ కలెక్టర్ ఒకే హాస్టల్‌ను సందర్శించకుండా పరిధిలోని అన్ని హాస్టళ్లను పరిశీలించి ఉంటే సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.విద్యార్థి సంఘాలు, ఇతర ప్రజా సంఘాల నాయకులను హాస్టళ్లలోకి వెళ్లేందుకు అనుమతించకపోవడం వల్ల అక్కడి పరిస్థితులు బయటకు రావడం లేదని ఆరోపించారు. అధికారులు హాస్టళ్లలో వాస్తవంగా ఏం జరుగుతుందో తెలుసుకునేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని కోరారు.విద్యార్థి మృతిపై కేవీపీఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఘటనకు బాధ్యులుగా తేలిన హాస్టల్ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గణపతి, రాహుల్, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధాలకు అద్దం పట్టిన మంత్రి పరామర్శ

## - చౌటకూరులో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరయ్యను కలిసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**అందోల్, ఆగస్టు 23, (ప్రజాజ్యోతి):**



ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో అనుబంధాలను కొనసాగిస్తూ మానవీయ కోణాన్ని చాటుకుంటున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకూరు మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు వీరయ్యను పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన వీరయ్యను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వీరయ్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్య సేవలు, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.వీరయ్య కుమారుడు మర్రి ప్రదీప్ ప్రస్తుతం మునిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను మంత్రి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు విచారించారు.మంత్రి పరామర్శ పట్ల వీరయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ప్రజలతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమంపై కూడా మంత్రి చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.



# విద్యా సరస్వతి దేవాలయం శిఖరం ప్రతిష్ట మహోత్సవశీ

## - ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

**జహీరాబాద్ ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)**



జహీరాబాద్ పట్టణ పరిధి లోని వెంకటరమణ కాలనీ లో నిర్వహించిన శ్రీ విద్యా సరస్వతి దేవాలయం శిఖరం ప్రతిష్ట మహోత్సవానికి జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మూడు రోజులపాటు భక్తిశ్రద్ధ లతో నిర్వహిస్తున్న ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. హోమాలు తదితర కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శిఖరం ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, విద్యకు, జ్ఞానానికి ప్రతీకగా భావించే సరస్వతి దేవి ఆలయ నిర్మాణం, అభివృద్ధి భక్తులకు ఎంతో ఆధ్యాత్మిక ప్రేరణను అందిస్తుందని అన్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యత, సోదరా భావం, సామాజిక సమైక్యతను పెంపొందిం. చేందుకు దోహద పడతా యని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న నిర్వాహకులు, దాతలు, భక్తులను ఆయన అభినందించారు. దేవాలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అలాగే వెంకటరమణ కాలనీలో మున్సిపల్ తరుపున అభివృద్ధికై కట్టుబాటుఉంటానని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని శాంతి, సౌభ్రాతృత్వం, సుఖ సంతోషాలతో, ఆయురా రోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ కు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు జమ్మిలుద్దీన్, అక్రమ్, నామ రవికిరణ్ నాయకులు బర్కత్, శేఖర్, స్థానిక నాయకులు, పూజారులు, వేద పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు బిఆర్ఎస్ పార్టీ నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 23 (ప్రజా జ్యోతి న్యూస్)**

ఆదివారం మాంకల్ బ్యాంకెట్ హాల్,పటేల్ గార్డెన్స్, పివిఆర్, ఓం కన్వెన్షన్ (కొత్తూరు డి) లో జరిగిన పలు వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, కోహీర్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు అశోక్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరా సంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, ఎఫ్ఎం సి అధ్యక్షులు సత్యం ముదిరాజ్ ,ఖలీమ్, రవి కుమార్, రాజేందర్ రెడ్డి, పురషోత్తం రెడ్డి, కౌన్సిలర్ లు ,గ్రామాల సర్పంచ్ లు,.మాజి ఎంపీటీసీలు, గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





# బయట ప్రపంచంలో అడుగుపెడుతున్న ఆడపిల్లలకు తండ్రి చెప్పాల్సిన ముఖ్యమైన మాటలు...

- చదువుతో పాటు ఆత్మవిశ్వాసం.. - భద్రతతో పాటు బాధ్యత నేర్పాలి..- ఆడపిల్లకు భయం కాదు.. ధైర్యమే తండ్రి ఇచ్చే గొప్ప బహుమతి...

ఆర్టికల్ హెచ్.శేఖర్ ప్రజా జ్యోతి రిపోర్టర్.

స్కూల్, కాలేజ్‌కు వెళ్లే ఆడపిల్లల జీవితంలో చదువు ఎంత ముఖ్యమో, జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం. తల్లిదండ్రులు ముఖ్యంగా తండ్రులు తమ కుమార్తెలకు కేవలం "జాగ్రత్తగా వెళ్లు.. జాగ్రత్తగా రా" అని చెప్పడం మాత్రమే కాకుండా, తమపై తాము నమ్మకం పెట్టుకోవడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, తప్పు జరిగితే భయపడకుండా తల్లిదండ్రులతో చెప్పడం వంటి విషయాలను నేర్పించాలి.

**నీ మాటకు విలువ ఉంది**

ఎవరైనా నీకు ఇబ్బంది కలిగించేలా మాట్లాడినా, ప్రవర్తించినా మౌనంగా భరించాల్సిన అవసరం లేదని తండ్రి తన కుమార్తెకు చెప్పాలి. నీకు నచ్చని విషయాన్ని స్పష్టంగా "వద్దు" అని చెప్పే హక్కు నీకు ఉందని తెలియజేయాలి. ఆత్మగౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ధైర్యం ఇవ్వాలి.

**చదువే నీ మొదటి బలం**

కాలేజీ వాతావరణంలో స్నేహాలు, సోషల్ మీడియా, ఇతర ఆకర్షణలు సహజమే. అయితే వాటి కారణంగా చదువును నిర్లక్ష్యం చేయవద్దని తండ్రి సూచించాలి. జీవితంలో ఎవరి మీద ఆధారపడకుండా నిలబడాలంటే విద్య, నైపుణ్యం, ఆర్థిక అవగాహన ఎంతో అవసరమని చెప్పాలి.

**స్నేహం విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకో**

స్నేహితులను ఎంచుకునే విషయంలో తొందరపడకూడదు. ఎవరు మంచివారు, ఎవరి సాంగత్యం మన భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది అనే విషయాన్ని ఆలోచించాలి. ఎవరైనా ఒత్తిడి చేస్తే, బెదిరిస్తే లేదా వ్యక్తిగత విషయాలను రహస్యంగా ఉంచమంటే వెంటనే నమ్మకమైన పెద్దలకు చెప్పాలని తండ్రి సూచించాలి.

**సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి**

ఫోన్, సోషల్ మీడియా ఉపయోగంలో వ్యక్తిగత ఫొటోలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోకూడదు. తెలియని వ్యక్తులతో ఆన్‌లైన్ స్నేహాలు పెంచుకోవడంలో జాగ్రత్త వహించాలి. ఎవరి మాటలకో, మెసేజ్‌లకో భయపడి డబ్బులు పంపడం లేదా రహస్య సమాచారం ఇవ్వడం చేయకూడదని తండ్రి స్పష్టంగా చెప్పాలి.

**అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే స్పందించాలి**

స్కూల్, కాలేజ్, ప్రయాణం లేదా ఇతర ప్రదేశాల్లో ఎవరైనా వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా దాన్ని దాచుకోవద్దు. "నువ్వు చెప్పినందుకు నిన్ను ఎవరూ తప్పుపట్టరు.. సమస్య నీది కాదు" అనే నమ్మకాన్ని తండ్రి తన కుమార్తెలో కలిగించాలి.

**ప్రయాణంలో భద్రతకు ప్రాధాన్యం**

స్కూల్ లేదా కాలేజ్‌కు వెళ్లేటప్పుడు సాధ్యమైనంత వరకు నమ్మకమైన రవాణా మార్గాలను ఉపయోగించాలి. ఇంటి నుంచి బయలుదేరే ముందు ఎక్కడికి వెళ్తున్నారో కుటుంబ సభ్యులకు తెలియజేయడం, ఆలస్యమైతే సమాచారం ఇవ్వడం అలవాటుగా చేసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలో ముందుగానే తెలుసుకోవాలి.

**తప్పులు జరిగితే తండ్రిని ఆశ్రయించాలి**

పిల్లలు తప్పులు చేయడం సహజం. కానీ ఆ తప్పును భయంతో దాచడం ప్రమాదకరం. "ఏ సమస్య వచ్చినా ముందు నాన్నకు చెప్పొచ్చు" అనే విశ్వాసాన్ని తండ్రి కల్పించాలి. మందలింపుకంటే ముందుగా పిల్లల మాట వినడం ఎంతో ముఖ్యం.

**కుమార్తెకు తండ్రి ఇచ్చే గొప్ప బహుమతి.. ధైర్యం**

ఆడపిల్లను ప్రతి అడుగులో భయపెట్టడం కంటే, ప్రతి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొనేలా తయారు చేయడం తండ్రి బాధ్యత. "ఎవరైనా నీకు తోడుగా ఉండాలి" అనే భావన కంటే "నువ్వు నీ కాళ్లపై నువ్వు నిలబడగలవు" అనే నమ్మకాన్ని పెంచాలి.ప్రపంచం మారుతోంది. పిల్లలకు కేవలం రక్షణ కల్పించడం మాత్రమే కాకుండా, స్వీయరక్షణ, ఆత్మవిశ్వాసం, మంచి చెడులపై అవగాహన, ఆర్థిక మరియు డిజిటల్ భద్రత, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం నేర్పించడం ప్రతి తండ్రి బాధ్యత.

**చివరగా ప్రతి తండ్రి తన కుమార్తెకు ఒక్క మాట మాత్రం చెప్పాలి.**

"నువ్వు ఎక్కడ ఉన్నా.. ఏ సమస్య వచ్చినా.. భయపడకుండా నాకు చెప్పు. నీ మాట నేను వింటాను. నీకు అండగా నేను ఉంటాను. నీ జీవితాన్ని నువ్వే నిర్ణయించుకునేంత ధైర్యంగా ఎదగాలి."అలాంటి నమ్మకం, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పెరిగిన ఆడపిల్ల కుటుంబానికే కాదు.. సమాజానికి కూడా గర్వకారణంగా నిలుస్తుంది.

హెచ్. శేఖర్ ప్రజా జ్యోతి రిపోర్టర్

గ్రామం:మన్నాన్పల్లి

మండలం:కొండాపూర్

# అభిలాష్‌కు న్యాయం చేయకపోతే ప్రభుత్వ పాలనను దిగ్బంధిస్తాం

- ప్రముఖ ఉద్యమకారుడు న్యాయవాది అలిగే జీవన్
- మహాత్మ జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల పాఠశాల.
- విద్యార్థి మృతి పై పూర్తి విచారణ.మృతుని కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి .

బాధ్యులైన ప్రిన్సిపాల్ మరియు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి



కల్హేర్ , ఆగస్టు 23: ప్రజా జ్యోతి.

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థి అభిలాష్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రముఖ న్యాయవాది, ఉద్యమ నేత అలిగే జీవన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అలిగే జీవన్ మాట్లాడుతూ.. బెల్లాపూర్ గ్రామానికి చెందిన గొల్ల చంద్రన్న కుమారుడు అభిలాష్ జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ హాస్టల్‌లో 5వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఘటనకు గల కారణాలను అధికారులు పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకురావాలని కోరారు. హాస్టల్ ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హాస్టల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు, బాధ్యులైన సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 3 ఎకరాల భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అభిలాష్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయకపోతే ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని దిగ్బంధించే స్థాయిలో ఉద్యమాన్ని చేపడతామని అలిగే జీవన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సంగుపేట చౌరస్తాలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సందడి

- కొత్త టిఫిన్ సెంటర్‌లో దోశ రుచి చూసిన మంత్రి..
- నిర్వాహకుల ఆనందం

అందోల్, ఆగస్టు 23, (ప్రజాజ్యోతి):

అందోల్ నియోజకవర్గ పర్యటనలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగుపేట చౌరస్తాలో సందడి చేశారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా సంగుపేట చౌరస్తాకు చేరుకున్న మంత్రి, అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్ నిర్వాహకులు మంత్రి తమ హోటల్‌లో అల్పాహారం తీసుకోవాలని కోరారు. వారి ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, నిర్వాహకుల కోరిక మేరకు వేడివేడిగా తయారు చేసిన దోశను అల్పాహారంగా స్వీకరించారు.మంత్రి తమ హోటల్‌కు వచ్చి అల్పాహారం తీసుకోవడంతో టిఫిన్ సెంటర్ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి దోశ తింటూ నిర్వాహకులతో సరదాగా మాట్లాడటం, స్థానికులతో మమేకం కావడం అక్కడి వాతావరణాన్ని సందడిగా మార్చింది. మంత్రి తమ టిఫిన్ సెంటర్‌ను సందర్శించడం తమకు ఎంతో సంతోషంగా, ప్రోత్సాహకరంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంత్రి సాధారణ ప్రజలతో మమేకమవుతూ స్థానిక వ్యాపారులను ప్రోత్సహించడం పలువురి దృష్టిని ఆకర్షించింది.



# రాయికోడ్ లో 24 గంటలూ మద్యం దొరుకుతుందా?

- ఉదయాన్నే గ్రామాలకు సరఫరా.. అధిక ధరలకు విక్రయాల ఆరోపణలు
- కిరాణా షాపుల్లో మద్యం విక్రయాలు
- పోలీసులకు,ఎక్సైజ్ అధికారులకు సమాచారం తెలిపిన పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు
- మద్యం అక్రమ విక్రయాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్

**రాయికోడ్ ఆగస్టు 23 (ప్రజా జ్యోతి):**

మండలంలో మద్యం విక్రయాలపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలకు నిర్ణీత సమయాలు ఉన్నప్పటికీ,మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు,కొన్ని సందర్భాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ముఖ్యంగా వైన్స్ దుకాణాల నుంచి గ్రామాలకు ఉదయాన్నే మద్యం సరఫరా చేస్తూ,అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### ఉదయాన్నే గ్రామాలకు మద్యం సరఫరా?

స్థానికుల ఆరోపణల ప్రకారం.. కొన్ని మద్యం దుకాణాల సిబ్బంది ఉదయం వేళల్లోనే వివిధ గ్రామాలకు మద్యం తరలిస్తున్నట్లు చెబుతున్నారు.వైన్స్ దుకాణాలు తెరవాల్సిన సమయానికి ముందే మద్యం గ్రామాల్లోకి చేరుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోని చిన్నచిన్న విక్రయ కేంద్రాల్లో కూడా మద్యం అందుబాటులో ఉంటోందని,దీంతో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు?

మద్యం బాటిళ్లపై ఉన్న ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.డిమాండ్ ఉన్న బ్రాండ్లను అదనపు ధరలకు విక్రయిస్తూ వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.ఈ ఆరోపణలపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను తేల్చాలని కోరుతున్నారు. పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు మండలంలో మద్యం విక్రయాలపై స్థానిక పోలీస్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు కనిపించడం లేదని కొందరు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అయితే పోలీస్ అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కాలేదు.ఈ అంశంపై సంబంధిత పోలీస్ అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.




### ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

మద్యం విక్రయాలు,అక్రమ సరఫరాపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మండలంలో ఎలాంటి పర్యవేక్షణ నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.వైన్స్ దుకాణాలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఎన్ని కేసులు నమోదు చేశారు? అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే విషయాలను అధికారులు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

### ముడుపుల ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలి

మద్యం దుకాణాల నిర్వాహకులు సంబంధిత అధికారులతో కుమ్మక్కై అక్రమ విక్రయాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు సైతం చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు.ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారణ చేపట్టి,ఆరోపణల్లో వాస్తవం ఎంతమేర ఉందో తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా స్పష్టం చేయాలని,నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఉదయం, అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలి

మండలంలోని వైన్స్ దుకాణాలు,అనుమానిత మద్యం విక్రయ కేంద్రాలపై ఉదయం వేళల్లోనే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.మద్యం దుకాణాలకు సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది? గ్రామాలకు ఎవరు మద్యం తరలిస్తున్నారు? నిర్ణీత సమయానికి ముందే విక్రయాలు జరుగుతున్నాయా? ఎంఆర్‌పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలని అంటున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

రాయికోడు మండలంలో మద్యం విక్రయాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా స్థాయి పోలీస్,ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.గతంలో నమోదైన కేసులు, నిర్వహించిన తనిఖీలు,స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం వివరాలను పరిశీలించడంతో పాటు అవసరమైతే ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.24 గంటలూ మద్యం అందుబాటులో ఉందన్న ఆరోపణలు నిజమేనా? ఉదయాన్నే గ్రామాలకు మద్యం సరఫరా అవుతోందా? ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా? ఈ వ్యవహారంలో అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,ఆరోపణల్లో వాస్తవం లేదంటే అధికారికంగా ఖండించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.